# నిజాయితీ

హొటల్లో టిఫిన్ తినేసి డబ్బులు చెల్లిద్దామని కౌంటరు దగ్గరికి వెళ్ళాను, చేతిలో బిల్లు ఉంచుకుని. హిప్ పాకెట్‌లో ఉన్న డబ్బులు తీయటానికి యింకో చేతిని పోనిచ్చాను. కౌంటరికి అటుప్రక్కన ఓ ఆరేళ్ళ అమ్మాయి నిలుచుని ఉంది. చిన్ని పెదాలూ, వెడల్పాటి కళ్ళూ, బుగ్గల్లో నొక్కులు....నల్లటి వెంట్రుకలు అలా చూచేసరికి యితరుల విషయం ఏమో గాని నాకు మాత్రం ఎంతో ఆనందమేసింది. ఆ పాపని చూచేసరికి. కాసేపట్లో జాలేసింది, ఆ పాప వేసుకున్న దుస్తుల్ని చూచి. చిరిగిపోయిన ఫ్రాకులోంచి చిన్నారి దేహం కన్పిస్తోంది. "ఏం కావాలో? ఆకలేస్తుందేమో?" అనుకున్నాను. కళ్ళెత్తి చూచేటప్పటికి కౌంటరు ముందర పది పదిహేను మంది జనం పోగయ్యారు. గబగబ బిల్లక్కడవేసి డబ్బులు బిల్లు మీదుంచాను. కౌంటరుమీద ఆరుఏడు బిల్లులు అయిదారు నోట్లు వచ్చిపడ్డాయి శపాల్న.

సరిగ్గా అదే క్షణంలో, ఆపాప జేబులోంచి, అయిదు ఆరు మడతలు మడచిన ఓ రూపాయి నోటుతీసి చేతులో ఉంచుకుని, చాచి మునివ్రేళ్ళమీద నిల్చుని కౌంటరుమీద వేసింది.

"చిల్లర యిస్తారా అండీ?" అంది.

ఆశ్చర్యపోయాను నేను. అంతదాకా నిల్చొని నిల్చొని ఎగాదిగా చూస్తూ నిలుచున్నది ఆ రూపాయి చిల్లర కోసమా? అనుకున్నాను.

కౌంటరుమీదున్న హోటల్ మేనేజరు రూపాయి నోటుని, అన్ని నోట్లతోబాటు కలుపుకుని గళ్ళా పెట్టెలో వేసుకున్నాడు. కౌంటరు దగ్గిర నిలుచున్న అమ్మాయి ముఖం పైకెత్తి చూస్తోంది. ఎక్కడో మాటాడుతో, రెండు పావలా రూకలూ ఏభై పైసలు అమ్మాయి దగ్గర వేశాడు తీసుకోమని మేనేజరు.

పైసలన్నీ నెమ్మదిగా తీసుకుని చిన్ని చేతుల్లో లెక్కెట్టుకుంది ఆ అమ్మాయి. కాసేపు చూచింది. కాళ్ళెత్తి అదోలా ముఖం పెట్టింది. ఆ పాప పద్ధతేం అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తున్నాను నేను.

"మీరు .... మరేమో రూపాయికి చిల్లర యిచ్చారండీ?" అంది.

"....మళ్ళా?" అన్నాడు ప్రశ్నిస్తూ మేనేజరు. కౌంటరులోంచి లేచి, వంగి, అమ్మాయిని చూచి పల్కరిస్తూ నెమ్మదిగా మేనేజరు. అంతలోనే ఆ లేత బుగ్గల్ని ఓసారి చిదిమాడు.

"మరేమో .... మరేమోనండీ! నేను....నేను యిచ్చింది రూపాయి కాదండీ?....అర్థ రూపాయకాసేనండీ? మరేమో మరేమోనండీ రూపాయ చిల్లర యిచ్చేరండీ!" అంది ఇంచుమించు ఏడుస్తున్నట్లుగా పాప.

---

రెండవ బహుమతి రూ. 25

జె. శశాంకశేఖర్
(బి. ఎ. మొదటి సంవత్సరం,
నిజామ్స్ కాలేజీ, హైదరాబాదు)

ఆశ్చర్యం కలిగింది నాకు. కాకపోతే ఏమిటిదీ. నా కళ్ళారా నేనే చూచానే! మడచిపెట్టిన నోటును తీసి కౌంటరుమీద వేసింది యీ పాపే. ఆపాప వేసింది రూపాయే. కానీ మరి అర్ధరూపాయే యిచ్చా నంటుందేం! అనుకున్నాను.

"అల్లాగా....! గుడ్‌గర్ల్! డబ్బు లెక్కవిచ్చానని వెనక్కిస్తుండటమే కాకుండా 'ఏడుస్తావెందుకూ....! మంచిదికదూ!?" అంటూ మతిమరపులో తాను అర్ధరూపాయే తీసుకుని రూపాయకి చిల్లర యిచ్చాను కాబోలు ననుకుని పాప యిచ్చిన అర్ధరూపాయిని పెట్టెలో వేసుకున్నాడు మేనేజరు.

"మణీ....!" అంటూ అంతటితో ఆగక ఓ సర్వరును పిలిచి, ఆ అమ్మాయి చేతిలో ఓ యిడ్డెనుపుంచమని చెప్పాడు.

"....వద్దండీ! నా కక్కర్లేదండీ? మా నాన్నగారరుస్తారండీ!" అందామ్మాయి.

"పర్లేదు తిను బేబీ!" అన్నాడు మేనేజరు.

ఆ పాప నిజాయితీ ఏమిటో బోధపడలేదింతకీ. సరే ఏమయినా యీ కేసు అంతు తేల్చుకోవాలనుకున్నాను. నెమ్మదిగా ఆ యిడ్లీ తిని...."వెళ్ళొస్తానండీ!" అని హోటల్‌దిగి నడిచి వెళ్ళింది పాప.

"....ఎవరో మంచి అమ్మాయిలాగుంది. పిల్లల పెంపకం అలా ఉండాలి. మన వాళ్ళయితేనా? మాట్లాడకుండా చక్కా పట్టుకొచ్చేస్తారు."

వెనకాల హోటల్ మేనేజరు ఎవరితోనో అంటున్నమాటలు వినిపిస్తోంటే నవ్వుకున్నాను. అమ్మాయిని వెంటాడుతూ....

తిరిగి చూడకుండా నడుస్తోందా పాప. చిక్కడపల్లి దాటి నారాయణగూడ వరకు నడచింది. గాంధీ బొమ్మ దగ్గర కాసేపు నిల్చుని చుట్టూ చూచింది. దూరంగా ఆ అమ్మాయిని చూస్తూనే ఉన్నాను నేను. దగ్గర్లో ఉన్న యింకో హోటల్లోకి దారి తీస్తుంటే చూచిన నేను పొందిన ఆశ్చర్యానికి అంతులేదు. అనుసరించి అదే హోటల్లోకి దారి తీశాను నేనూ. ఆ పాప ఎవరినీ గమనించకుండా కౌంటరు దగ్గరికి నడిచింది.

ఎవరో సర్వర్ వచ్చి అడిగాడేం కావాలని ఆ పాపని.

"పది యిడ్లీలు పార్సెల్ చేసివ్వు! గట్టి చట్నీ వెయ్యేం?" అంది.

కాఫీ తాగుతూ ఆ పాప మాట్లాడిన ప్రతి మాట వింటున్నాను నేను. సరిగ్గా అదే సమయానికి రష్ యెక్కువయిపోయింది. సర్వర్ కాసేపట్లో పెద్ద పార్సెల్ తెచ్చి యిచ్చి వెళ్ళిపోయాడు. బిల్లు తీసుకున్న నేను. ఆ పాప కదులుతుందేమో అని చూస్తూ నిలుచున్నాను. కానీ పది నిమిషాలయినా కదలని ఆ పాపని చూస్తోంటే అర్థంగాక తెల్లమొహం వేశాను నేను. కాసేపట్లో రష్ తగ్గింది కౌంటర్‌లో కూచున్న హోటల్ మేనేజరు అమ్మాయిని చూచి నట్లున్నాడు.

"ఏం పాపా? ఏం కావాలీ?" అన్నాడు ప్రేమగా.

"డబ్బులండీ?" అం దమాయకంగా

ముఖంపెట్టి కౌంటర్ మీదికి ఎగురుతూ యించుమించు.

'అయితే యిదన్న మాట నాటకం' అనుకున్నాను నేను. నేరుగా కౌంటర్ దగ్గరపోయి నిల్చున్నాను నేనూ.

"అల్లాగా పాపా మరచిపోయాను నేను. ఎంతిచ్చావమ్మా నీవు? ఏం తీసుకున్నావ్?" లాలిస్తూ అడిగాడు మేనేజరు.

"మరేమోనండీ? పదిడ్డీలు పార్శిల్ తీసుకున్నానండీ....! పది రూపాయల నోటు యిచ్చానండీ. పోతే మరేమో నండీ నాన్నగారేమో తొమ్మిది రూపాయల చిల్లర వస్తుందని చెప్పారండి."

పదిరూపాయలే! హే భగవాన్! ఎంత మోసం? అన్యాయం. ఈ లేత వయసులోనే ఇంత అన్యాయమా? ఇన్ని అబద్ధాలా? ఎలా నేర్చుకుందీ పాప? ఎవరు నేర్పారీ పాపకు?

ఊహూఁ నా మనసూరుకోలేదు. కానీ, తిరిగి చూద్దునుకదా? చిరిగిన ఫ్రాకును పైకెత్తి కన్నీళ్ళు ఒత్తుకుంటోన్న పాప కనిపించింది. అబ్బా! ఎంత అద్భుతంగా నటిస్తోంది, చిన్న పాపయినా అనుకున్నాను. ఆ హోటల్లో దొంగ నిజాయితీ ప్రదర్శించి అర్ధరూపాయి నష్టం చేసుకుంది. ఇక్కడ అమాయకతని ప్రదర్శించి పది రూపాయలు దొంగిలించు కుంటున్నది. పిల్లలు చేసే పెద్దతరహా దొంగతనమా? లేక పిల్లల వెనక పెద్దలు చేసే చిన్న తరహా లాటీయా?

"ఏడ్వకు పాపా! ఇదుగో ఇస్తున్నాగా! తీసికెళ్లు ఏడ్వకేం?"

పార్శిలు తొమ్మిదిరూపాయల చిల్లరా, పుచ్చుకుని బయటికి వెళ్ళి పోయింది పాప.

హోటల్ వాడిని అడిగాను నేను.

'అదేమిటండీ? ఆ పాప డబ్బులే యివ్వలేదు. అలా ఆ అమ్మాయి అడిగినంతా యిచ్చేయటమే!? అన్నాను.

"ఇంకా నయం? ఆ పాపముందే చెప్పారుగాదు. ఎంత నొచ్చుకునేదో! తనది కానిది ఒక్క పైసా కూడా ముట్టదు తెలుసా? ఓసారిలాగే మరపులో బాగా రష్ యెక్కువగా ఉన్నపుడు.... రెండు రూపాయల నోటు యిచ్చిందనుకుని చిల్లర యిచ్చాను. కానీ తీసుకుని వెళ్ళిపోయిందను కున్నారు గదూ? ఊహూఁ. వెళ్ళలేదు. తానిచ్చింది రూపాయేనని, రూపాయ డబ్బులు తిరిగి యిచ్చి మరీ వెళ్ళింది ఏడుస్తూ! ఆ పాప మాకేం కొత్త కాదులెండి! చాలా నిజాయితీగల పిల్ల....!"

అంటే యీ హోటల్లో ఈ నాటకం యింతక్రితం ఆడిపోయిందన్నమాట. ఈనాడు ఆ నిజాయితీతో పది రూపాయలు కొట్టేసింది. చిక్కడపల్లి హోటలుదగ్గర తగులుతుందేమో యింకో రోజు.

ఎంత గొప్ప ప్లాను!?

ఆశ్చర్యంతో బయటికి వచ్చి చుట్టూ చూచాను. పక్కనే ఉన్న గల్లిలోకి దారి తీస్తోంది పాప. ఆశ్చర్యంతో నిలుచుండి పోయా నలాగే నేను.

★★★